
# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్

శుక్రవారం 8 ఆగస్టు 2025 పేజీలు 8








### చామకూర కుటుంబం చెరలో..!

# ఫాక్స్‌సాగర్ చెరువు..!

## మల్లారెడ్డి కుమారుడు ఫాక్స్‌సాగర్ చెరువు అల్లుడు చిన్న దామెర చెరువు కబ్జా..




ఫాక్స్‌సాగర్ చెరువులో భారీ బహుళ అంతస్తుల నిర్మాణం..

- మాజీ మంత్రి మల్లారెడ్డి కుమారుడు, జీడిమెట్ల ఫాక్స్‌సాగర్ 3800 గజాలు కబ్జా..!
- అల్లుడు మల్కాజిగిరి ఎమ్మెల్యే దుండిగల్ చిన్నదామెర చెరువు 8-20 ఎ. కబ్జా..
- సూరారం లింగంచెరువు తూముకు అడ్డంగా, ఎమ్మెల్యే మల్లారెడ్డి భారీ నిర్మాణం..
- పంతులు చెరువు, చిన్న బంధం, పెద్ద బంధం చెరువుల గొలుసుకట్టు కాలువలు కబ్జా..!
- మైసమ్మ గూడాలో మల్లారెడ్డి యూనివర్సిటీ కూడా చెరువులోనే..?
- చెరువులు చెర బడుతున్న చామకూర కుటుంబం.. అండగా బీఆర్ఎస్ నేతలు.
- రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసి అధికారుల అండతో కబ్జాల పర్వం..
- తప్పుడు పత్రాలతో అక్రమ అనుమతుల నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని.
- రెవెన్యూ, హెచ్ఎండిఏ, ఇరిగేషన్, కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు..
- ఆకుల సతీష్ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కి, మున్సిపల్ కమిషనర్‌కి ఫిర్యాదు..

- జీడిమెట్లలో 125 ఏళ్ళనాటి చారిత్రాత్మక చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్ కబ్జా..
- దుండిగల్‌లో చిన్న దామెర చెరువు 8-20 ఎకరాలు కబ్జా..
- మాజీ మంత్రి మల్లారెడ్డి సూరారంలో భూగర్భంలో గొలుసు కట్టుకాలువలు..

మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కుటుంబం చెరువులే లక్ష్యంగా కబ్జాలకు పాల్పడటం అలవాటుగా చేసుకున్నారు.. ఇప్పటికే మల్లారెడ్డి అల్లుడు రాజశేఖర్ రెడ్డి, దుండిగల్ గ్రామ పరిధిలోని చిన్న దామెర చెరువును ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్ స్థలాన్ని 8-20 ఎకరాలు కబ్జాచేసి విద్యాసంస్థలు నిర్మించగా..! మేడ్చల్ మండలం మైసమ్మ గూడాలోని మల్లారెడ్డి యూనివర్సిటీలో మరో చెరువు ఆక్రమణలో ఉన్నది తెలిసిందే.. సూరారం లింగం చెరువు తూముకు అడ్డంగా మల్లారెడ్డి భారీ అక్రమ నిర్మాణం నేటికీ సాక్ష్యంగా చూడవచ్చు.. దీనికి తోడు ఐదు చెరువుల గొలుసుకట్టు కాలువను భూగర్భంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీగా మార్చిన మాజీ మంత్రి మల్లారెడ్డి, కుమారుడు భద్రా రెడ్డి, 1897-99 నాటి చారిత్రక ఫాక్స్‌సాగర్ చెరువును 3800 గజాలు కబ్జాచేసి బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపట్టడం.. ఇవి వంశపారంపర్య కబ్జాలకు నిదర్శనం.. చెరువుల కబ్జాలే లక్ష్యంగా మల్లారెడ్డి విద్యాసంస్థలు..? అధికారంలోకి వచ్చిన ఆరంభంలో హడావుడి చేసిన రేవంత్‌రెడ్డి సర్కార్ ఆతర్వాత గప్‌చుప్.. సంబంధిత అధికారులు కూడా "కావల్సింది పుచ్చుకోవడం..! కబ్జాలకు సహకరించడం పరిపాటిగా మారింది..!" తెలంగాణ స్వ రాష్ట్ర సాధనతో, చెరువులు, ప్రభుత్వ భూములు కనుమరుగు.. ఏ ఎండకు ఆగొడుగు పట్టే నాయకులు, పాలకుల చేతిలో తెలంగాణ రాష్ట్రం.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఆగష్టు 7:

-2లో



అధికారులకు ఫిర్యాదు..

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన... ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక విజ్ఞప్తి

- హైదరాబాద్‌లో భారీ వర్షాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని నగర ప్రజలకు విజ్ఞప్తి
- అర్ధరాత్రి వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వెల్లడి
- లోతట్టు ప్రాంతాల్లో తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశం
- రాష్ట్రంలోని పలు జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు స్పష్టం

-2 లో


హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షాలు ముంచెత్తుతున్న నేపథ్యంలో, ప్రజలు అత్యవసరమైతే తప్ప తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నగరంలో కురుస్తున్న కుండపోత వానలపై ఆయన ఉన్నత



హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ లో హాట్ టాపిక్‌గా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం జరిగింది. హైదరాబాద్‌కు గురువారం కేంద్ర హోం శాఖ అధికారులు వచ్చారు. ఫోన్ ట్యాపింగ్

-2 లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం.. హైదరాబాద్‌కు కేంద్ర హోం శాఖ అధికారులు





# చామకూర కుటుంబం చెరలో..! ఫాక్స్‌సాగర్ చెరువు..!

**ఫాక్స్‌సాగర్ చెరువు మధ్యలో మాజీ మంత్రి మల్లారెడ్డి ఫామ్ హౌస్‌కు సిమెంట్ రోడ్ వేసుకున్న ఘనత కూడా మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డికే, చెందుతుందని సతీష్ ఎద్దేవా చేశారు.. ఇప్పుడు మంత్రి మల్లారెడ్డి అండ దండలతో ఆయన కుమారుడు భద్రారెడ్డి అధికారులను, వ్యవస్థలను మేనేజ్ చేస్తూ అనుమతులు పొందడమే కాకుండా నిర్మాణం కూడా పూర్తయ్యే దశకు వచ్చింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వం చెరువులను కాపాడేందుకు.. ఆపరేషన్ హైడ్రా ఏర్పాటు చేసినప్పటికీ..! చారిత్రక ఫాక్స్‌సాగర్ చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో నిర్మాణం చేపట్టడం, ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు చోద్యం చూస్తున్నారు..మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి అక్రమ భవనాన్ని తక్షణమే కూల్చి వేయాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.. తప్పుడు పత్రాలుతో అధికారులను మేనేజ్ చేసి అనుమతులు పొందడమే కాకుండా నిర్మాణం చేపడుతున్న వారిపయై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, చందు, ఈశ్వర్ రెడ్డి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు..**



- మొదటి పేజి తరువాయి

ఫాక్స్ సాగర్ ని చేరబట్టిన చామకూర కుటుంబంపై సంబంధిత అధికారులకు, ఆకుల సతీష్ ఫిర్యాదు చేశారు.కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 151, 179 లో ఫాక్స్‌సాగర్ చెరువు ఎఫ్‌టిఎల్/బఫర్ జోన్‌లో దాదాపు 3800 గజాల పైచిలుకు స్థలంలో భారీ భవన్ నిర్మాణానికి తప్పుడు పత్రాలతో అక్రమ అనుమతులు, అండ్ నిర్మాణంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, హెచ్ఎండిఏ, ఇరిగేషన్, కొంపల్లి మున్సిపల్ కమిషనర్‌కి సతీష్ ఫిర్యాదు చేశారు.. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ సర్వే నెంబర్. 151, 179లొల, ప్లాట్ నెంబర్ 504, 505 కొంపల్లి గ్రామం దుండిగల్ మండలంలో ఫాక్స్‌సాగర్ చెరువు యొక్క ఎఫ్.టి.ఎల్ మరియు బఫర్ జోన్ ఎఫ్‌టిఎల్ కోఆర్డినేట్స్ (A 61 to A63) లో 3823 వదరపు మీటర్ల విస్తీర్ణంలో "స్టిల్ట్ ప్లస్ 5" అంతస్తుల భారీ భవన్ నిర్మాణానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కుమారుడు చామకూర భద్రారెడ్డి మరియు ఇతరులు కలిసి(శ్రీ షిరిడి సాయి బిల్డర్స్) హెచ్ఎండిఏ నుంచి టిజి-బిపాస్ ద్వారా 2022లోనే అక్రమంగా అనుమతులు పొందటం విశేషం .(006398/%BP/HMDA/ 1267/MED/2022 dt:02-11-2022). ఫాక్ సాగర్ చెరువు యొక్క ఎఫ్ టి ఎల్ కోఆర్డినేట్స్ ఎ 61 నుంచి ఎ 63 వరకు..! ప్రస్తుతం భవన నిర్మాణం జరుగుతున్న 90 శాతం భవనం పూర్తిగా ఎఫ్టిఎల్ మరియు బఫర్ జోన్‌లోనే ఉన్నప్పటికీ..! ఇరిగేషన్, మున్సిపల్, హెచ్ఎండిఏ మరియు రెవెన్యూ అధికారులు ఏ విధంగా అనుమతులు ఇచ్చారో మిలియన్ డాలర్ల ప్రశ్నగా సతీష్ ఆరోపించారు..

## డబ్బు అధికారం అడ్డుపెట్టుకుని చెరువుల ఆక్రమణ..

ఇప్పటికే భూగర్భజలాలు అడుగంటి పోయాయని నివేదికలు చెబుతున్నాయి..!అయినప్పటికీ అటు పాలకులకు, ఇటు ప్రభుత్వ అధికారులకు ఏమాత్రం బాధ్యత లేకుండా విధులు నిర్వర్తిస్తున్నారు.. ప్రభుత్వ ఆస్తులను అక్రమార్కులకి కట్టబెట్టడానికి యంత్రాంగం కీలకపాత్ర పోషిస్తుందనే విమర్శలు వస్తున్నాయి.. ఫాక్స్‌సాగర్ చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో అనుమతులు పొందడానికి ప్రధాన కారణం, గత టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటి నుండి మాజీ మంత్రి మల్లారెడ్డి తనకున్న అధికారంతో చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లో కూడా అనుమతులు పొందారు.. దారు సంఘటన ఏంటంటే..? ఫాక్స్‌సాగర్ చెరువు కట్టు డౌన్ స్ట్రీమ్‌లోనూ గ్రీన్ బెల్ట్ ఏరియాను తనకు అనుకూలంగా మార్చుకున్నట్లు సమాచారం.. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చెరువులను రక్షించడం కన్నా భక్షించడం పైనే దృష్టి పెట్టింది కనిపిస్తుందని ఆకుల సతీష్ ఆరోపించారు.. చెరువును చూపించకుండా సైట్ మ్యాప్‌లో నాలాగా చూపించుకొని అనుమతులు పొందడం గమనార్హం.. అధికారులే ఇలా తప్పుడు పర్మిషన్‌లు మంజూరు చేసి చెరువు కబ్జాకు సహకరించినట్టుగా స్పష్టమవుతుంది..

## హైదరాబాద్‌కు భారీ వర్ష సూచన...
## ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక విజ్ఞప్తి

- మొదటి పేజి తరువాయి

స్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో అర్ధరాత్రి వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీసు, ట్రాఫిక్, జలమండలి (హైడ్రా) అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని స్పష్టం చేశారు. హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల పాటు వర్షాలు కొనసాగే అవకాశం ఉన్నందున, అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. వర్షాలు, వరదల వల్ల ఏవైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే, వాటిని ఎదుర్కొనేందుకు అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆయన గట్టిగా సూచించారు.

### ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం..
## హైదరాబాద్‌కు కేంద్ర హోం శాఖ అధికారులు

- మొదటి పేజి తరువాయి

అంశంపై అధికారులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ చర్చించారు. ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ భేటీకి హాజరుకావడం గమనార్హం. ఎస్ఐబీ, సిట్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో పనిచేసిన అధికారులతో బండి సంజయ్ ప్రత్యేకంగా చర్చించారు. కేసీఆర్ ప్రభుత్వం బండి సంజయ్ ఫోన్?ను ఎక్కువ సార్లు ట్యాప్ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. వాటికి సంబంధించి సేకరించిన ఆధారాలను కేంద్ర నిఘా వర్గాలు కేంద్ర మంత్రి బండి సంజయ్ ముందుంచాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ ఎదుట హాజరవుతున్న తొలి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయే కావడం గమనార్హం. ఈ క్రమంలో.. ఫోన్ ట్యాపింగ్?కు సంబంధించిన అనేక ఆధారాలను కేంద్ర మంత్రి సేకరిస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బండి సంజయ్ శుక్రవారం సిట్ ఎదుట హాజరుకాబోతున్నారు. ఈ విచారణ సందర్భంగా పలు ఆధారాలను సమర్పించనున్నారు.

## పద్మనాభస్వామి ఆలయం బి-నేలమాళిగపై ఉత్కంఠ.. పూజారిదే తుది నిర్ణయం!

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేరళలోని శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో అత్యంత రహస్యమైన 'బి-నేలమాళిగ' తెరిచే అంశం మరోసారి తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాదాపు ఐదేళ్ల విరామం తర్వాత తెరపైకి వచ్చిన ఈ వివాదంపై తుది నిర్ణయం తీసుకునే కీలక బాధ్యతను ఆలయ తంత్రికే (ప్రధాన పూజారి) అప్పగించారు. దీంతో ఈ మిస్టరీ వీడుతుందా లేదా అనే ఉత్కంఠ మళ్లీ మొదలైంది. గురువారం తిరువనంతపురంలో ఆలయ పాలక మండలి, సలహా మండలి సంయుక్త సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బి-నెలమాళిగ అంశాన్ని ప్రస్తావించారు. 2020లో సుప్రీంకోర్టు దీనిపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని కమిటీల విచక్షణకే వదిలేసినా, ఇప్పటివరకు ఎలాంటి ముందడుగు పడలేదని ఆయన గుర్తుచేశారు. అయితే, ఈ కీలక సమావేశానికి ఆలయ తంత్రి గైర్హాజరయ్యారు. ఈ నేపథ్యంలో, కమిటీలు ఈ సున్నితమైన విషయంపై తుది నిర్ణయాన్ని తంత్రికే వదిలేశాయి. భవిష్యత్తులో ఆయన తన నిర్ణయాన్ని తెలియజేయాల్సి ఉంటుంది. శ్రీ పద్మనాభస్వామి ఆలయంలో మొత్తం ఆరు నేలమాళిగలు ఉండగా, వాటిలో అపారమైన బంగారం, వజ్రాలు, అమూల్యమైన కళాఖండాలు ఉన్నట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికే ఐదు నేలమాళిగలను తెరిచారు. కానీ, ఆధ్యాత్మిక కారణాలు, నిర్మాణపరమైన ఆందోళనల కారణంగా బి-నేలమాళిగను మాత్రం ఇప్పటివరకు తెరవలేదు. దీని చుట్టూ అనేక రహస్యాలు, పురాణగాథలు ప్రచారంలో ఉన్నాయి. గతంలో సుప్రీంకోర్టు నియమించిన మాజీ కాగ్ వినోద్ రాయ్ తన నివేదికలో బి-నేలమాళిగను ఇదివరకే రెండుసార్లు తెరిచారని పేర్కొన్నట్లు వచ్చిన వార్తలు పెనుదుమారం రేపాయి. అయితే, ఒకప్పుడు ఆలయ నిర్వాహకులుగా ఉన్న ట్రావెన్‌కోర్ రాజకుటుంబం ఈ వాదనను తీవ్రంగా ఖండించింది.

## కేసీఆర్‌ను నేనేందుకు జైల్లో వేస్తా.. ఫామ్‌హౌజ్‌లో ఆయనే బందీ అయ్యారు: సీఎం రేవంత్



న్యూఢిల్లీ: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్?పై మరోసారి హాట్ కామెంట్స్ చేశారు సీఎం రేవంత్ రెడ్డి. కేసీఆర్?ను నేనేందుకు జైల్లో వేస్తానని.. ఫామ్?హౌజ్?లో ఆయనకు ఆయనే బందీ అయ్యారన్నారు. కేసీఆర్ ఫామ్?హౌస్?కు.. చర్లపల్లి జైలుకు పెద్ద తేడా ఏముందని.. ఫామ్?హౌజ్?లో పర్యవేక్షణ ఉంటుంది.. జైల్లో పహారా ఉంటుంది అంతేనన్నారు రేవంత్ రెడ్డి. ఇంకా కొత్తగా ఆయన్ని జైల్లో పెట్టి శిక్షించేదేముందని.. ప్రజలు ఓడించి ఫామ్‌హౌజ్‌కు పరిమితం చేయడమే కేసీఆర్?కు పెద్ద శిక్ష అన్నారు. నెక్స్ట్ టైమ్ కూడా రాష్ట్రంలో అధికారం మాదేనని.. ఇక కేసీఆర్ దుప్పటి కప్పుకుని ఫామ్?హౌస్?లో పడుకోవాల్సిందేనని హాట్ కామెంట్ చేశారు. మేం దుప్పటి కప్పుకోని పడుకున్నా చేసిన సంక్షేమం, అభివృద్ధి చూసి ప్రజలే మళ్లీ మమ్మల్ని గెలిపిస్తారన్నారు. ఇతరుల ఇంటి వ్యవహారాల్లో వేలు పెట్టకుంటే అధికారం దానంతట అదే వస్తదని బీఆర్ఎస్?కు చురకలంటించారు. తాను ద్వేషపూరిత రాజకీయాలు చేయడం లేదని.. బీఆర్ఎస్ నేతలకు నైతికత గురించి మాట్లాడే హక్కు లేదని అన్నారు. ఇక, జూబ్లీహిల్స్ బై పోల్ గురించి మాట్లాడుతూ.. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక జరగొచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్?లో బుధవారం (ఆగస్ట్ 6) తెలంగాణ కాంగ్రెస్ మహాధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ధర్నాలో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. గురువారం (ఆగస్ట్ 7) అక్కడే మీడియా ప్రతినిధులతో చిట్ చాట్?గా మాట్లాడుతూ పై వ్యాఖ్యలు చేశారు.

## రష్యా అధ్యక్షుడు పుతిన్ తో అజిత్ దోవల్ కీలక సమావేశం

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్-రష్యా మధ్య వ్యూహాత్మక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. రష్యా పర్యటనలో ఉన్న భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమయ్యారు. మాస్కోలోని క్రెమ్లిన్‌లో జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీ ఇరు దేశాల మధ్య బలమైన స్నేహ బంధానికి నిదర్శనంగా నిలుస్తోంది.ఈ సమావేశంలో ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించినట్లు తెలుస్తోంది. దోవల్‌తో పాటు రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగు, అధ్యక్ష కార్యాలయం సహాయకుడు యూరి ఉషకోవ్ కూడా ఈ భేటీలో పాల్గొన్నారు. ఇరు దేశాల మధ్య రక్షణ, వాణిజ్యం, ఇంధన రంగాల్లో సహకారాన్ని మరింత విస్తృతం చేయడంపై ఈ చర్చలు దృష్టి సారించినట్లు సమాచారం. ఈ పర్యటనలో భాగంగా అజిత్ దోవల్ రష్యా భద్రతా మండలి కార్యదర్శి సెర్గీ షోయిగుతో విడిగా కూడా భేటీ అయ్యారు. ఈ భేటీలోనే రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత పర్యటనకు సంబంధించిన సన్నాహకాలపై ప్రధానంగా చర్చించినట్లు తెలుస్తోంది. త్వరలోనే వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించే అవకాశం ఉందని, ఇందుకు సంబంధించిన తేదీలను ఖరారు చేసే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ ఉన్నత స్థాయి పర్యటనలు ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొత్త శిఖరాలకు చేర్చగలవని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ట్రంప్ 50 శాతం సుంకాలు విధించారు... బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడేమయ్యాయి?: ఒవైసీ

**హైదరాబాద్ పెన్ పవర్:**భారత్‌పై అమెరికా భారీ సుంకాలను విధించడంపై ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసినందుకు భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా 50 శాతం సుంకం విధించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఇది దౌత్యం కాదని, అమెరికా అధ్యక్షుడి దాదాగిరి అని గురువారం 'ఎక్స్' వేదికగా విమర్శించారు.



అమెరికా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల భారత ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. "ట్రంప్ మనపై మరో 25 శాతం సుంకాన్ని విధించారు, దీంతో మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. అంతర్జాతీయ వాణిజ్యం ఎలా పనిచేస్తుందో తెలియని వ్యక్తి మనల్ని బెదిరిస్తున్నారు," అని ఆయన పేర్కొన్నారు. ఈ సుంకాల వల్ల భారత ఎగుమతిదారులు, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఈ), తయారీదారులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. అంతేకాకుండా, సరఫరా గొలుసులు దెబ్బతిని, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గిపోయి, ఉద్యోగాలకు గట్టి దెబ్బ తగులుతుందని ఆయన హెచ్చరించారు.

ఈ పరిణామాలపై ప్రధాని నరేంద్ర మోదీ మౌనాన్ని ఒవైసీ తీవ్రంగా ప్రశ్నించారు. "ఈ విషయాలు నరేంద్ర మోదీకి ఎందుకు పట్టడం లేదు? బీజేపీ నేతల ప్రగల్భాలు ఇప్పుడు ఏమయ్యాయి?" అని నిలదీశారు. గతంలో ట్రంప్ 56 శాతం సుంకాలు విధిస్తే మోదీ తన 56 అంగుళాల ఛాతీని చూపిస్తారా అని తాను ప్రశ్నించానని, బహుశా అందుకే ట్రంప్ 50 శాతంతో ఆగిపోయారేమోనని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని మీ మిత్రులైన బిలియనీర్ల ఖజానాలు నింపడం కోసం తాకట్టు పెట్టారా?" అని ఒవైసీ ప్రశ్నించారు.

జూలై 31న కూడా ఇదే అంశంపై స్పందించిన ఒవైసీ, భారత్ ఒక స్వతంత్ర సార్వభౌమ దేశమని, అమెరికాకు సామంత రాజ్యం కాదని అన్నారు. జపాన్‌పై 15 శాతం, వియత్నాంపై 20 శాతం, ఇండోనేషియాపై 19 శాతం సుంకాలు విధిస్తూ, భారత్‌పై మాత్రం కక్షపూరితంగా వ్యవహరించడం మన పోటీతత్వాన్ని దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫోన్, ల్యాప్‌టాప్ ఇలా వాడకండి.. పురుషులకు ఆ సమస్యలు తప్పవు..!



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్యాంటు జేబులో ఎక్కువ సేపు మొబైల్ ఫోన్ ఉంచుకోవడం, ల్యాప్‌టాప్‌ను ఒడిలో పెట్టుకుని పనిచేయడం వల్ల మనిషి సంతానోత్పత్తిపై ప్రతికూల ప్రభావం చూపడమే కాకుండా నపుంసకత్వానికి గురయ్యే ప్రమాదం కూడా ఉందని ఒక అధ్యయనం పేర్కొంది. కలకత్తా యూనివర్సిటీ (CU) యొక్క జంతుశాస్త్ర విభాగం యొక్క జెనెటిక్స్ రీసెర్చ్ యూనిట్, కోల్‌కతాకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిప్రొడక్టివ్ మెడిసిన్ (IRM) సంయుక్తంగా నిర్వహించిన ఒక అధ్యయనం ఈ ప్రమాదం గురించి వివరించింది.

ల్యాప్‌టాప్‌ను ల్యాప్‌లో ఉంచుకోవడం లేదా ప్యాంట్ జేబులో మొబైల్‌ను ఉంచుకోవడం వల్ల అధిక-తీవ్రత కలిగిన విద్యుదయస్కాంత క్షేత్రం ఏర్పడుతుందని అధ్యయనం కనుగొంది. వృషణాలను అటువంటి ప్రాంతాలకు ఎక్కువసేపు దగ్గరగా ఉంచడం వలన, సంబంధిత వేడి వృషణాలలోని సున్నితమైన కణజాలాలకు గణనీయమైన నష్టాన్ని కలిగిస్తుంది, ఫలితంగా స్పెర్మ్-ఉత్పత్తి కణాలకు నష్టం జరుగుతుంది.

నిర్దిష్ట జన్యు ఉత్పరివర్తనలు కలిగిన వ్యక్తులలో ఈ నష్టం మరింత తీవ్రంగా కనిపిస్తుంది మరియు ముఖ్యంగా ఇటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఎక్కువగా ఉపయోగించే యువకులకు ఆందోళన కలిగిస్తుంది. నమూనాలను విశ్లేషించిన పురుషులు 20-40 సంవత్సరాల వయస్సు గలవారు.అధ్యయన బృందం ఈ వయసు వారి జీవనశైలి, ఆహారం, కార్యాలయంలో పనిచేసే పరిస్థితులు, మాదకద్రవ్య వ్యసనాలను అధ్యయనం చేసింది. ప్రొ. ఘోష్ మాట్లాడుతూ.. ఎలక్ట్రానిక్ పరికరాలను జాగ్రత్తగా వాడాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని అన్నారు.

ప్రొఫెసర్ సుజయ్ ఘోష్ (కలకత్తా విశ్వవిద్యాలయం), డాక్టర్ రత్న చటోపాధ్యాయ , డాక్టర్ సముద్ర పాల్ (కలకత్తా విశ్వవిద్యాలయం), డాక్టర్ పర్నాబ్ పలాధి ( డాక్టర్ సౌరవ్ దత్తా (కలకత్తా విశ్వవిద్యాలయం) నేతృత్వంలో 2019లో ఈ అధ్యయనం ప్రారంభించబడింది.

పరిశోధనా పత్రం ప్రకారం.. పురుషుల వంధ్యత్వానికి చికిత్స కోసం %×=వీ%కి వచ్చే వ్యక్తులు కూడా అధ్యయనంలో పాల్గొన్నారు. అధ్యయనం తెలియని కారణాల వల్ల కలిగే మగ వంధ్యత్వానికి సంబంధించిన కేసులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రత్యేకంగా అజోస్పెర్మియా లేదా ఒలిగోజోస్పెర్మియా (తక్కువ సంఖ్యలో స్పెర్మ్) కేసులను అధ్యయనం చేసింది.

అధ్యయనానికి నాయకత్వం వహించిన డాక్టర్ ఘోష్.. ఈ అధ్యయనంలో జన్యు నిర్ధారణ పరీక్షల ద్వారా తెలిసిన అంటు వ్యాధులు ఉన్న రోగులను కూడా చేర్చలేదని చెప్పారు. పై రోగులే కాకుండా మొత్తం 1,200 మంది రోగులను ఈ అధ్యయనంలో చేర్చినట్లు ఆయన తెలిపారు.

## బీజేపీ పవర్?లోకొస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తం: రామచందర్ రావు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలంగాణ బీజేపీ చీఫ్ రామచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది బీసీ బిల్లు కాదు.. ముస్లిం రిజర్వేషన్ బిల్లు అని పేర్కొన్నారు. గురువారం (ఆగస్ట్ 7) భువనగిరి జిల్లా బీజేపీ పార్టీ కార్యకర్తల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీసీ పేరుతో కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తోందని.. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయడం లేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కేసుల్లో ఒక్క బీఆర్ఎస్ నేతను కూడా అరెస్ట్ చేయలేదని.. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కేటననడానికి ఇదే రుజువని అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్?కు అవకాశం ఇచ్చిన తెలంగాణ ప్రజలు బీజేపీకి కూడా ఒక ఛాన్స్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. భువనగిరి ప్రజలు బీజేపీని ఆదరిస్తున్నరని... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో కమలం పార్టీకి భారీగా సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా మూసీ ప్రక్షాళన చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి మాటలు చెప్పారని.. ఆయనవి ఉత్త మాటలేనని.. అవి కార్యరూపం దాల్చిలేదని విమర్శించారు. రాష్ట్రంలో యూరియాను మార్కెట్?లో బ్లాక్ చేసి చేస్తున్నారు.. కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆరోపించారు.

## ఓ మనిషి మరో మనిషిని లాగడమేంటి.? చేతి రిక్షాల వాడకంపై సుప్రీం దిగ్భ్రాంతి..!

**హైదరాబాద్ పెన్ పవర్:**హ్యాండ్‌లాడ్ రిక్షాల వాడకంపై సుప్రీంకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మథేరాన్‌లో ఈ అమానవీయ ఆచారాన్ని ఆరు నెలల్లోగా నిలిపివేయాలని, దాని స్థానంలో ఈ-రిక్షాలను తీసుకురావాలని సుప్రీంకోర్టు బుధవారం మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశంలో ఇటువంటి పద్ధతులను అనుమతించడం సామాజిక, ఆర్థిక న్యాయం వంటి రాజ్యాంగ వాగ్దానాలను బలహీనపరుస్తాయని.. ఇది మానవ గౌరవానికి సంబంధించిన ప్రాథమిక భావనకు విరుద్ధమని చీఫ్ జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కె. జస్టిస్ వినోద్ చంద్రన్, ఎన్వి అంజరియాలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. దీంతో పాటు మథేరన్‌లో హ్యాండ్‌లాడ్ రిక్షాలను పూర్తిగా నిషేధించాలని ధర్మాసనం ఆదేశించింది.గుజరాత్ అధికారులు కేవడియాలో చేసినట్లుగా, మాథేరన్‌లో స్థానిక ప్రజలకు ఈ-రిక్షాలను అద్దెకు ఇచ్చే అవకాశాలను అన్వేషించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా చేతితో లాగించే రిక్షాలను ఉపయోగించే విధానాన్ని ధర్మాసనం ఖండించింది. ఇది అమానవీయమని అభివర్ణించింది.

# అసలు మ్యాటర్ ఇది: ఢిల్లీలో ధర్నాకు రాహుల్ గాంధీ రాకపోవడంపై CM రేవంత్ క్లారిటీ




**హైదరాబాద్ పెన్ పవర్:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్?లో బుధవారం (ఆగస్ట్ 6) తెలంగాణ కాంగ్రెస్ మహాధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ధర్నాకు కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే హాజరుకాకపోవడంపై బీజేపీ, బీఆర్ఎస్ విమర్శలు గుప్పించాయి. రేవంత్ రెడ్డిపై నమ్మకం లేకనే రాహుల్ గాంధీ, ఖర్గే ధర్నాకు హాజరు కాలేదని విమర్శించాయి.

ఈ క్రమంలో రాహుల్, ఖర్గే మహాధర్నాకు హాజరుకాకపోవడానికి గల కారమేంటన్నది క్లారిటీ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ, ఖర్గే ధర్నాకు రాకపోవడంపై కొందరు పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. ఇలాంటి మాటలు మాట్లాడే వాళ్లను చూస్తే జాలేస్తోందన్నారు. బుధవారం (ఆగస్ట్ 6) శిబూ సోరెన్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు రాహుల్ గాంధీ జార?ండ్ వెళ్లారని.. అందుకు నిన్నటి ధర్నాకు రాలేకపోయారని వివరణ ఇచ్చారు. తెలంగాణ కులగణన బెస్ట్ మోడల్ అని రాహుల్ గాంధీ చెప్పింది గుర్తు లేదా అని ప్రతిపక్షాలకు కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు, కిషన్ రెడ్డి పస లేని, పనికి రాని వాదనలు అని కొట్టేపారేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు బీసీ ద్రోహులని విమర్శించారు. ఆ రెండు పార్టీలు చేస్తోన్న కుట్రలను తెలంగాణ సమాజం మొత్తం గమనిస్తోందని హెచ్చరించారు. ముస్లింల పేరు చెప్పి 42 శాతం బీసీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇక, బీసీ రిజర్వేషన్ల విషయంలో బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తుందని.. కాంగ్రెస్ ఏ మంచి పని చేసినా విమర్శించడమే బీఆర్ఎస్ పనిగా పెట్టుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలో చేపట్టిన ధర్నాకు బీఆర్ఎస్ ఎందుకు రాలేదు..? బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ తీరుని బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. అసలు బీసీలకు మద్దతు ఇవ్వాలనే సోయి బీఆర్ఎస్?కు ఉందా అని కడిగిపారేశారు. బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా బీజేపీకి బీఆర్ఎస్ సహకరిస్తోందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ తీరును ఎండగట్టేందుకు పీసీసీ ఆధ్వర్యంలో త్వరలోనే భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామన్నారు. క్షేత్రస్థాయిలో బీజేపీ, బీఆర్ఎస్ కు గుణపాఠం చెప్పేలా కాంగ్రెస్ భవిష్యత్ కార్యచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

# రాఖీ పండుగ : మహాభారత యుద్ధంలో శ్రీకృష్ణుడు, ద్రౌపది మధ్య ఘటనతో ఇలా పుట్టింది రాఖీ పండుగ..!

**హైదరాబాద్ పెన్ పవర్:**రాఖీ పండుగ గురించి పురాణాల్లో కొన్ని కథలున్నాయి. భాగవతం.. భవిష్యపురాణంలో కూడా కొన్ని కీలకఘట్టాలున్నాయని పండితులు చెబుతున్నాయి. మహాభారత యుద్ధంలో జరిగిన ఓ సంఘటన నుంచి రాఖీ పండుగ పుట్టిందని పురాణాల ద్వారా తెలుస్తుంది. ఆ తరువాత దేవుళ్లు కూడా రక్షాబంధనాన్ని జరుపుకున్నారని పండితులు చెబుతున్నారు. వాటిలో కొన్నింటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.




భారతంలో శ్రీకృష్ణుడు శిశు పాలుడిని వధించాల్సిన సమయంలో సుదర్శన చక్రాన్ని ప్రయోగిస్తారు. అప్పుడు కృష్ణుడి చేతికి గాయమవుతుంది. ఆ గాయాన్ని చూసిన వెంటనే పంచపాండవుల భార్య అయిన ద్రౌపది... తన చీర కొంగును చించి శ్రీకృష్ణుడి వేలుకి రక్షగా చుడుతుంది. అప్పుడు కృష్ణుడు... నీకు ఎటువంటి సమయంలోనైనా ఎలాంటి ప్రమాదం వచ్చినా నన్ను తలుచుకో కాపాడతాను' అని అభయమిస్తాడు. తర్వాత దుర్యోధనుడి సోదరుడు దుశ్శాసనుడు నిండుసభలో ద్రౌపది చీరను లాగి అవమానించినప్పుడు శ్రీకృష్ణుడు చీరలు అందించి ఆదుకున్నాడు. అలా ద్రౌపది గౌరవమర్యాదలను కాపాడటానికి రాఖీ కారణమైంది. ఈ సంఘటనే రక్షాబంధనానికి నాందిగా నిలిచిందని చెప్తారు.

బలి చక్రవర్తి కోరిక మేరకు శ్రీ మహావిష్ణువు అతనతోపాటు పాతాళంలో ఉండిపోతాడు. అప్పుడు శ్రీమహాలక్ష్మీ వెళ్లి బలిచక్రవర్తికి రక్షాబంధనం కట్టి, తన భర్తను వైకుంఠానికి తీసుకువస్తుంది. అందుకే రక్షా బంధానికి ఇంత ప్రాధాన్యత ఏర్పడిందని పురాణాలు చెబుతున్నాయి.

# తప్పక వస్తా.. ప్రతీకారం తీర్చుకుంటా!



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ పేరుతో జరిగిన శిశువుల అక్రమ ఫెర్టిలిటీ ముఠా వ్యవహారం సమాజాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. సికింద్రాబాద్‌లోని ఈ కేసు దర్యాప్తు కొనసాగుతున్న కొద్దీ, అనేక దారుణమైన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసులు చేపట్టిన విశ్లేషణల ఆధారంగా, ఈ ముఠా పెద్దఎత్తున బిడ్డల దందాకు పాల్పడినట్లు నిర్ధారించారు.

### ప్రధాన నిందితులు, పాత్ర

ఈ కేసులో ఇప్పటివరకు 27 మంది నిందితులపై కేసులు నమోదయ్యాయి. వీరిలో ప్రధాన నిందితురాలిగా డాక్టర్ నమ్రత గుర్తించబడ్డారు. ఆమెతో పాటు ఆమె సహచరుడు జయంత్, మేనేజర్ కల్యాణి, టెక్నీషియన్ మోక్షిత వంటివారు కూడా ఈ ముఠాలో కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే 26 మందిని పోలీసులు అరెస్ట్ చేయగా, ఒక మహిళకు బెయిల్ మంజూరైంది.

### దందా ఎలా నడిచింది?

పోలీసుల విచారణలో 80 మంది శిశువులు చేతులు మారినట్లు, సుమారు రూ. 20 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడైంది. ఈ ముఠా ఒక్కో శిశువును రూ. 4–5 లక్షలకు కొనుగోలు చేసి, సరోగసీ లేదా దత్తత పేరుతో అక్రమంగా రూ. 30–50 లక్షలకు విక్రయించింది. ఈ దందా విశాఖ, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లో ఫెర్టిలిటీ సెంటర్ల మాటున జరిగిందని అధికారులు గుర్తించారు.

### దారుణమైన పద్ధతులు

ఈ ముఠా గర్భిణీ స్త్రీలను డబ్బు ఆశ చూపించి ప్రసవాలు చేయించి, శిశువులను అమ్ముకుంది. ఇంకా దారుణమైన విషయం ఏమిటంటే, కొన్ని సందర్భాల్లో గర్భధారణ పూర్తి కాకుండానే ఆపరేషన్లు చేసి బిడ్డలను బయటకు తీసినట్లు కూడా తేలింది. గర్భిణీలకు ఐవీఎఫ్ (%×ఎఫ్‌%), హార్మోన్ ట్రీట్‌మెంట్ పేరుతో ఇష్టానుసారం ఇంజెక్షన్లు ఇచ్చేవారు. ప్రముఖ గైనకాలజిస్టుల పేరిట నకిలీ మెడికల్ ప్రిస్క్రిప్షన్‌లను కూడా ఉపయోగించారు.

### దర్యాప్తు, ఆస్తుల వివరాలు

ఈ ముఠాకు చెందిన ఆస్తులపై పోలీసులు దృష్టి సారించారు. విశాఖ, హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల్లో ఆసుపత్రులు, నివాసాల వివరాలను సేకరిస్తున్నారు. ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత బ్యాంకు ఖాతాలను ఫోరెన్సిక్ ఆడిటింగ్ చేయాలని నిర్ణయించారు. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. జైలు నుంచి నమ్రత "సెప్టెంబరులో విడుదలవుతాను, అందరి లెక్కలు తేలుస్తాను" అని చెప్పినట్లు కూడా వార్తలు వచ్చాయి. దీంతో ప్రతీకారం తీర్చుకుంటానన్న డాక్టర్ నమ్రత వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. అయితే ఆమె ఈ వాదనలను ఖండించారు.

ఈ కేసు దేశవ్యాప్తంగా సరోగసీ పేరుతో జరుగుతున్న అక్రమాలపై పెద్ద చర్చకు దారి తీసింది. దోషులకు కఠిన శిక్షలు పడాలని, బాధితులకు న్యాయం జరగాలని సమాజం కోరుకుంటోంది.

# 100 హెక్టార్ల విస్తీర్ణంలో బంగారు నిక్షేపాలు..తవ్వే కొద్దీ బంగారమే.. ఎక్కడో తెలుసా?



**హైదరాబాద్ పెన్ పవర్:**ఇండియాలో గోల్డ్ కి ఉన్న డిమాండ్ గురించి ఎంత చెప్పినా తక్కువే.. ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్ వచ్చిందంటే చాలు బంగారం దుకాణాలు జనాలతో కళకళలాడుతూ ఉంటాయి. అటు రష్యా అమెరికా వంటి దేశాలలో ఏర్పడిన ఉద్రిక్త వాతావరణం మరొకవైపు రూపాయి విలువ పడిపోవడం కారణంగా బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి ప్రస్తుతం 10 గ్రాముల బంగారం ధర లక్షకు పైమాటే. తప్పని పరిస్థితుల్లో బంగారం కొనుగోలు చేయాల్సి వస్తోందని దీనివల్ల సామాన్యులపై మరింత భారం పడుతుందని పలువురు చెప్పుకొస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలను చూసి భయపడిపోతున్న ఎంతోమంది ప్రజలు ఎక్కడైనా గని ఉంటే వెళ్లి తవ్వుకుందాం అంటూ సరదాగా కామెంట్లు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ మాటలే నిజమవుతున్నాయని చెప్పవచ్చు. వాస్తవానికి భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా, రాజస్థాన్ ,ఝూర?ండ్ వంటి కొన్ని ప్రాంతాలలో బంగారు గనులు కూడా ఉన్నాయి.. కానీ ప్రత్యేకించి కొన్ని ప్రాంతాలలో మాత్రం తవ్వే కొద్ది బయటపడేంత బంగారు గనులు ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు తాజా పరిశోధనలో తేల్చారు. పరిశోధనలో బయటపడిన విషయానికి వస్తే.. ఒక ప్రాంతంలో 100 హెక్టార్ల విస్తీర్ణంలో బంగారు గని ఉందని, అందులో తవ్వే కొద్ది బంగారు నిక్షేపాలు బయటపడుతున్నాయని ఒక వార్త వెలుగు చూడడంతో అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అది ఎక్కడ ఉంది? అని తెలుసుకోవడానికి ప్రజలు కూడా ఆసక్తి కనబరుస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే మధ్యప్రదేశ్ రాష్ట్రంలో జబల్‌పూర్ నగరంలో భూమిలోపల లక్షల టన్నుల బంగారం ఉందంటూ కొంతమంది శాస్త్రవేత్తలు తెలియజేస్తున్నారు. అక్కడ కొంతమంది సైంటిస్టులు పరిశోధనలు చేసిన తర్వాత.. అక్కడ వారు సేకరించిన కొన్ని నమూనాలను పరిశీలించడంతో బంగారు గనుల నిక్షేపాలు ఉన్నట్లుగా తేలిందని.. ఈ బంగారు గనులు సిహెూరా తాలూకాలోని మహాంగ్వా కేవత్రి ప్రాంతాలలో ఉన్నట్లుగా గుర్తించారు పరిశోధకులు. ఇప్పటికే జబల్‌పూర్ ప్రాంతం ఎక్కువగా మాంగనీస్, ఇనుము వంటి ఖనిజాలకు పెట్టింది పేరు. ఇప్పుడు కొత్తగా బంగారు నిక్షేపాలు ఉన్నాయని తేలడంతో జబల్‌పూర్ ప్రాంతం అధిక ప్రాధాన్యత సంతరించుకోవడమే కాకుండా ఇప్పుడు ఈ ప్రాంతంపై మధ్యప్రదేశ్ ప్రభుత్వం కూడా ప్రత్యేకించి మరీ ఫోకస్ చేసినట్లుగా తెలుస్తోంది. ఇకపోతే ఈ జబల్‌పూర్ నగరం సమీపంలోని మహాంగ్వా కేవత్రి ప్రాంతంలో బంగారు నిక్షేపాలు ఉన్నట్లు భౌగోళిక సర్వే ద్వారా సైంటిస్టులు తేల్చి చెప్పడంతో.. ఈ ఆవిష్కరణ జరిగిన తర్వాత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గణనీయంగా మార్చేందుకు ఇదే మంచి పరిణామం అని భావిస్తోంది. ఇక్కడ సుమారుగా

100 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ బంగారు గనులు విస్తరించి ఉన్నాయని , దీంతో పాటు రాగి, ఇతర విలువైన ఖనిజాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఉండే బంగారు నిక్షేపాలు దేశంలో బంగారు ఉత్పత్తిలో ముఖ్యమైన పాత్ర పోషించే అవకాశం కూడా ఉంది అని చెప్పవచ్చు. ఇప్పుడు కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ లాంటి చారిత్రక గనులు గతంలో దేశ బంగారు ఉత్పత్తికి ఎంతో దోహదపడ్డాయి. ఇప్పుడు ఈ జబల్‌పూర్ గనులు కూడా భవిష్యత్తులో ముఖ్యమైన ఆర్థిక వనరుగా మారే అవకాశం ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు. పైగా ఇక్కడ వేలాదిమందికి ఉపాధి లభించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇక ఈ ప్రాంతంలోని గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు కూడా మారబోతున్నాయని అక్కడి ప్రాంత ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## హైదరాబాద్ సిటీలో క్లౌడ్ బరస్ట్.. సిటీ మొత్తం వర్ష బీభత్సం.. రంగంలోకి హైడ్రా, GHMC



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్?లో కుండపోత వర్షం కురుస్తోంది. దాదాపు అరగంట నుంచి రికార్డ్ స్థాయిలో వాన పడుతోంది. సిటీ మొత్తాన్ని నల్లటి మబ్బులు కమ్మేశాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో వర్షం బీభత్సం సృష్టిస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్?కి ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది ఐఎండీ. మరో రెండు గంటల పాటు హైదరాబాద్?లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. అత్యవసరమైతేనే ఇండ్ల నుంచి బయటకు వెళ్లాలని సూచించింది. సిటీలో ఈదురు గాలులు, మెరుపులు, ఉరుములతో కూడిన కుండపోత వర్షం పడుతుండటంతో నగరంలో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్ అయ్యింది. వరద నీరు రోడ్లపైకి చేరడంతో కిలో మీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. వర్ష బీభత్సానికి నగరంలోని కొన్ని ప్రాంతాలు కరెంట్ లేక అంధకారంగా మారాయి. డ్రైనేజీలు, నాలాలు పొంగిపొర్లుతుండటంతో బస్తీ వాసులు, లోతట్టు ప్రాంత ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆఫీసుల నుంచి సరిగ్గా ఇండ్లకు వెళ్లే సమయంలో వర్షం కురుస్తుండటంతో ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. సిటీలో అల్లకల్లోలం సృష్టిస్తుండటంతో జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీఆర్ఎస్ బృందాలు అప్రమత్తమై రంగంలోకి దిగాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.
హైదరాబాద్ సిటీలోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, హైటెక్ సిటీ, ఎల్బీనగర్, నాగోలు, హయత్ నగర్, వనస్థలిపురం, అబ్దుల్ పూర్ మెట్ ఏరియాల్లో భారీ వర్షంతో రోడ్లపై నీళ్లు పారుతున్నాయి.
ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పటం లేదు వాహనదారులకు.
పంజాగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, హైటెక్ సిటీ, ఐకియా ఏరియాల్లో ట్రాఫిక్ నిదానంగా సాగుతుంది.
దిల్ షుఖ్ నగర్, మలక్ పేట్, అత్తాపూర్, కొత్తపేట, చంపాపేట ఏరియాల్లో వర్షం భారీగా పడుతుంది.
సాయంత్రం మొదలైన వర్షం అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని ప్రకటించింది వాతావరణ శాఖ.
హైదరాబాద్ ఓల్డ్ సిటీ ఏరియాలోనూ భారీ వర్షంతో.. లోతట్టు ప్రాంతాల్లోకి నీళ్లు వచ్చాయి. సంతోష్ నగర్, చాంద్రాయణగుట్ట, కాంచన్ బాగ్, షాలిబండ, ఛత్రినాక, సికింద్రాబాద్, కంటోన్మెంట్ ఏరియాల్లోనూ వర్షం భారీగా పడుతుండటంతో.. రోడ్లపై నీళ్లు ఉండటంతో.. వాహనదారులు ఎక్కడికక్కడ రోడ్ల పక్కన ఆగిపోయారు.

### హైదరాబాదీలకు గుడ్ న్యూస్.. వరద సమస్యకు చెక్ పెట్టేందుకు స్మార్ట్ వాటర్ మాస్టర్ ప్లాన్

హైదరాబాద్ పెన్ పవర్: ఐటీ, ఫార్మా రంగాలకు ప్రసిద్ధి చెందిన హైదరాబాద్?ను వరద సమస్య వెంటాడుతోంది. చిన్న వర్షం పడిన కూడా సిటీ చిగురుటాకులా వణికిపోతుంది. విరామం ఇవ్వకుండా ఒక అర్ధగంట భారీ వర్షం పడితే నగరం చెరువులు, కుంటలను తలపిస్తోంది. వరద నీరు రోడ్లపైకి చేరి వాహనదారులు, బస్తీ వాసులు, లోతట్టు ప్రాంత ప్రజలకు నరకయాతన అనుభవించాల్సిందే.
ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ నగరానికి వరద సమస్య ఒక మచ్చగా మారింది. ఈ క్రమంలో వరదలతో నానా అవస్థలు పడుతోన్న హైదరాబాదీలకు గుడ్ న్యూస్ చెప్పింది ప్రభుత్వం. హైదరాబాద్?లో వరద నియంత్రణ కోసం 'స్మార్ట్ వాటర్ మాస్టర్ ప్లాన్' సిద్ధం చేసేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేసింది. నగరంలో వరద సమస్యలపై దీర్ఘకాలిక పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ప్రణాళిక తయారు చేయనుంది. నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై మాస్టర్ ప్లాన్ రూపొందించనుంది. మాస్టర్ ప్లాన్ తయారు చేసేందుకు అర్హత కలిగిన కన్సల్టెంట్?లను ఎంపిక చేసేందుకు టెండర్లు పిలవాలని జీహెచ్ఎంసీకి ఆదేశాలు జారీ చేసింది.

## బిగ్ బ్రేకింగ్.. పోలీసులకు షాక్, వైసీపీ నేతకు బెయిలు

హైదరాబాద్ పెన్ పవర్:ఏపీ పోలీసులకు రాష్ట్ర హైకోర్టు షాకిచ్చింది. వైసీపీ నేత, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్ రిమాండ్ రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. నిందితుడిని వెంటనే విడుదల చేయాలని రిమాండ్ రిపోర్టును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తురకా కిషోర్ పై దాదాపు 12 కేసులు నమోదయ్యాయి. వీటిలో వరుసగా అతడిని అరెస్టు చేస్తున్నారు పోలీసులు. ఇదే క్రమంలో ఇటీవల ఓ కేసులో బెయిల్ పై బయటకు వచ్చిన అతడిని జైలు నుంచి విడుదలైన వెంటనే మరో కేసులో అదుపులోకి తీసుకున్నారు. దీన్ని సవాల్ చేస్తూ తురకా కిశోర్ భార్య హైకోర్టులో పిటిషన్ వేయగా, నిందితుడి రిమాండ్ ను ఉన్నత న్యాయస్థానం తప్పుబట్టింది.
జైలు నుంచి విడుదలైన తన భర్తను రెంటచింతల పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని, ఆయన విడుదలకు ఆదేశించాలని తురకా కిశోర్ భార్య సురేఖ గత వారం కోర్టులో అత్యావసర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు వరుసగా విచారణ చేపట్టింది. ఈ రోజు జరిగిన విచారణలో నిందితుడు తురకా కిశోర్ అరెస్టును తప్పుబట్టిన హైకోర్టు, అరెస్టు సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనలు



పాటించలేదని పోలీసులను తప్పుబట్టింది. చట్ట నిబంధనలను తుంగలోకి తొక్కారని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించలేదని న్యాయస్థానం తీవ్ర వ్యాఖ్యలు చేసింది.నిందితుడి భార్య సురేఖ పిటిషన్ పై విచారణ జరిపిన జస్టిస్ రఘునందన్ రావు ధర్మాసనం నిందితుడిపై నమోదైన కేసు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. నిందితుడిని రిమాండ్ కు పంపుతూ మేజిస్ట్రేట్ జారీ చేసిన ఉత్తర్వులను మరోమారు పరిశీలించి, నిందితుడు బెయిలు పిటిషన్ దాఖలు చేయలేదన్న కారణంతో రిమాండ్ విధించడాన్ని తప్పుబట్టింది. బెయిలు కోసం దరఖాస్తు చేయకపోతే, మిగిలిన అంశాలను పరిశీలించాల్సిన అవసరం లేదా? అంటూ ధర్మాసనం ప్రశ్నించింది.
కాగా, రిమాండ్ రిపోర్టు తీసుకునేందుకు నిందితుడు అంగీకరించలేదని పోలీసులు చెబుతుండగా, మేజిస్ట్రేట్ తన ఉత్తర్వుల్లో ఆ ప్రస్తావన చేయకపోవడంపై ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది. పరస్పర విరుద్ధమైన వాదనలు వినిపిస్తున్నారని అసహనం వ్యక్తం చేసింది. నేరాంగీకార వాంగ్మూలంపై కిశోర్ సంతకం చేయలేదని అంటున్నారు? మీరు చెబుతున్నట్లు అతడు కరుడుగట్టిన నేరస్తుడే అనుకున్నా, అన్ని నేరాలు చేశానంటూ ఒప్పేసుకుంటాడా? అని ధర్మాసనం ప్రశ్నించింది. ఇక ఒక వ్యక్తి నిర్బంధం అక్రమమైనప్పుడు ఒక్క క్షణం కూడా జైల్లో ఉండటానికి వీల్లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. నిందితుడు తురకా కిశోర్ తక్షణం విడుదలకు ఆదేశాలు జారీ చేసింది.

## భారత యువత మద్యానికి భానిస అవుతుందా..? కారణం ఏమై ఉంటుందంటే..?

హైదరాబాద్ పెన్ పవర్:సినిమాకెళ్లినా.. అంతెందుకు సీరియల్ చూడాలనుకున్నా మొదట కనిపించేది కన్జమ్షన్ యాడ్. లిక్కర్ తీసుకోకండి, స్మోకింగ్ చేయకండి అనే కనిపిస్తుంది. ఇది చూసి జనం మారుతారనే లక్ష్యంతో దీన్ని ముందుగా ప్రదర్శిస్తారు. సినిమా రన్నింగ్ లో కూడా ఆల్కహాల్, స్మోకింగ్ ఉన్న చోట కిల్స్, ఆరోగ్య కరమైన హెచ్చరికలు వేస్తుంటారు. అయితే ఇది చూసిన జనం మానేస్తారనడం ఎంత వరకు నిజమో తెలియదు కానీ. నేడు పెరుగుతున్న లిక్కర్ వియోగాన్ని చూసి వైద్యులు, ఆరోగ్య నిపుణులు మాత్రం ఆందోళన చెందాల్సి వస్తుంది.



### ఇటీవల సర్వేలో సంచలన విషయాలు..

ఇటీవల ఒక సర్వేలో సంచలన విషయాలు వెలువడ్డాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆల్కహాల్ వాడకం తగ్గిందట. ఇది సంతోషించే విషయమే కానీ భారత్ కు మాత్రం కాదు. ఎందుకంటే అంతటా తగ్గుతున్నా.. భారత్ లో మాత్రం పెరుగుతుందంట. మారుతున్న జీవనశైలి దీనికి ప్రధాన కారణంగా కనిపిస్తోందని సర్వేలు చెప్తున్నాయి. భారత్ ప్రస్తుతం ఎదుగుతోంది. ఆర్థిక పరంగా వరల్డ్ లోనే ఐదో స్థానంలో కొనసాగుతోంది. సగటు వ్యక్తి సంపాదన కూడా కొంతలో కొంత వరకు పెరిగింది. దీంతో యువత మద్యం వైపు చూస్తున్నారు.

### పెరిగేందుకు కారణం ఇదేనా..?

పెరుగుతున్న పని ఒత్తిడి కూడా కొంత కారణం కావచ్చన్న వార్తలు వినిపిస్తున్నాయి. ప్రపంచంలోనే ఇండియా కార్మిక శక్తిలో పెద్దది. ఇక్కడి జనాభా ప్రపంచంలోనే నెంబర్-1 కాబట్టి కార్మికులు కూడా ఎక్కువ, ఇందులో భారతీయ యువత శ్రమశక్తిని నమ్ముకుంటారు. అందుకే విదేశాలలో ఇండియన్ వర్కర్స్ కు విలువ ఎక్కువ ఉంటుంది.
వారికి ఇచ్చే వేతనం మాత్రం తక్కువగానే ఉంటుంది. ఎక్కువ వర్క్ తక్కువ వేతనం, దీనికి తోడు ఇండియన్స్ కుటుంబానికి ఎక్కువ విలువలిస్తారు. కాబట్టి పండుగలు, కుటుంబ పరమైన ఫంక్షన్లు కూడా వీటికి కారణమని కొందరు చెప్తారు. ఏది ఏమైనా గ్లోబల్ గా ఆల్కహాల్ కన్జమ్షన్ తగ్గుతున్నా.. భారత్ లో మాత్రం పెరగడం కొంత ఇబ్బందులకు దారం తీస్తుంది.

# డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం.. భారతీయ వలస కుటుంబాలకు తీవ్ర ఆర్థిక భారం

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం భారతీయ వలస కుటుంబాలకు పెద్ద షాక్. భారతదేశం నుంచి దిగుమతి అయ్యే బంగారం , ప్లాటినం ఆభరణాలపై 57% దిగుమతి సుంకం విధించారు. ఈ కొత్త పాలసీ, వ్యక్తిగతంగా ఆభరణాలను తీసుకువచ్చినా లేదా అమెరికాలో ప్రదర్శనల నుండి కొనుగోలు చేసినా వర్తిస్తుంది. ఇది అమెరికాలో స్థిరపడిన భారతీయుల జేబులపై తీవ్ర ప్రభావం చూపనుంది.



**ధరల్లో పెరుగుదల**

ఈ కొత్త సుంకం వల్ల ధరలు ఎలా పెరుగుతాయో ఒక ఉదాహరణతో చూద్దాం. ఒక నెక్లెస్ ధర సాధారణంగా %వి%20,000 (సుమారు రూ. 16.5 లక్షలు) ఉంటే, ఇప్పుడు దానిపై అదనంగా 57% సుంకం కట్టాలి. అంటే, నెక్లెస్ ధర %వి%31,400 (సుమారు రూ. 26 లక్షలు) అవుతుంది. ఇది మధ్యతరగతి కుటుంబాలకు భారీ భారం. ముఖ్యంగా పెళ్లిళ్లు, పండుగలు మరియు సంప్రదాయ పెట్టుబడుల కోసం ఆభరణాలు కొనుగోలు చేసేవారికి ఇది పెద్ద ఇబ్బంది.

**వ్యాపార రంగంపై ప్రభావం**

ఈ నిర్ణయం కేవలం కొనుగోలుదారులకే కాకుండా, వ్యాపారులకు కూడా నష్టాలను తెచ్చిపెడుతుంది. ప్రతి సంవత్సరం %వి%2 బిలియన్ల విలువైన భారత బంగారు ఆభరణాల వాణిజ్యంపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుంది. అమెరికాలో ఉన్న చిన్న వ్యాపార జ్యువెలర్స్ , భారతీయ వలస వ్యాపారులు దీని వల్ల ఎక్కువగా నష్టపోతారు.

**ప్రస్తుత పరిస్థితుల్లో ఏం చేయాలి?**

ఈ కొత్త నిబంధనల నేపథ్యంలో పరిశ్రమ నిపుణులు కొన్ని సూచనలు ఇస్తున్నారు. మీరు విదేశీ ప్రయాణం చేసే ముందు ఆభరణాలపై ఉన్న కస్టమ్స్ నిబంధనలను పూర్తి వివరాలు తెలుసుకోండి. అమెరికాలోని జ్యువెలరీ దుకాణాల్లో కొనుగోలు చేసేటప్పుడు, మీరు చెల్లించే ధరలో సుంకం కలిసి ఉందా లేదా అని అడగండి. ప్రస్తుతానికి పెద్ద మొత్తంలో ఆభరణాలు కొనుగోలు చేయడాన్ని వాయిదా వేసుకోవడం మంచిది.

ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఇప్పుడు ఆభరణాల ఖరీదు కేవలం బంగారం ధరపైనే కాకుండా, కొత్తగా విధించిన 57% సుంకంపై కూడా ఆధారపడి ఉంటుంది. ఈ పరిణామాలు వలస భారతీయుల ఆర్థిక ప్రణాళికలపై దీర్ఘకాలిక ప్రభావం చూపనున్నాయి.

# సంక్షోభంలోనే అవకాశాలు.. అమెరికా టారిఫ్ షాక్‌పై ఆనంద్ మహీంద్రా స్పందన

**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై దిగుమతి సుంకాలను 25% నుంచి 50%కి పెంచడం భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ఆందోళనలను రేకెత్తిస్తోంది. ముఖ్యంగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తుందనే కారణంతో విధించిన ఈ టారిఫ్‌లు, భారతదేశ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపవచ్చని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ సంక్షోభాన్ని కేవలం ఒక సవాలుగా కాకుండా... ఒక గొప్ప అవకాశంగా మార్చుకోవచ్చని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్రా తన ఆలోచనలను పంచుకున్నారు.



**ఆనంద్ మహీంద్రా స్ఫూర్తిదాయకమైన ఆలోచనలు**

"సంక్షోభంలోనే అమృతం దొరుకుతుంది!" అని ఆయన తన ట్విట్టర్ ఖాతాలో పేర్కొన్నారు. 1991లో భారతదేశం విదేశీ మారక నిల్వల సంక్షోభంలో ఉన్నప్పుడు, లిబరలైజేషన్‌కు మార్గం సుగమమైందని గుర్తుచేశారు. ఆ సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పుకు దారితీసింది. ఇప్పుడు అమెరికా విధించిన టారిఫ్‌లు కూడా అలాంటి ఒక అవకాశంగా మారవచ్చు అని ఆయన విశ్వసిస్తున్నారు.

**భారత్ తీసుకోవలసిన కీలక చర్యలు**

ఆనంద్ మహీంద్రా ఈ సంక్షోభాన్ని అధిగమించడానికి, దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి రెండు కీలక అడుగులు సూచించారు..

**ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ మెరుగుపరచడం**

పెట్టుబడులను ఆకర్షించాలంటే, దేశంలో వ్యాపారాలు చేయడం సులభతరం కావాలి. అనవసరమైన అడ్డంకులను తొలగించి, పారదర్శకమైన విధానాలను తీసుకురావాలి. అనుమతుల కోసం అనేక చోట్లకు వెళ్లే బదులు, సింగిల్ విండో క్లియరెన్స్ సిస్టమ్‌ను అభివృద్ధి చేయడం ద్వారా పెట్టుబడులు పెట్టేవారికి మరింత సౌలభ్యం కల్పించాలి.

**పర్యాటకం, తయారీ రంగాలపై దృష్టి**

విదేశీ మారక నిల్వలను పెంచుకోవడానికి పర్యాటక రంగాన్ని బలోపేతం చేయడం అత్యంత అవసరం. ఇది దేశంలో ఉపాధి అవకాశాలను కూడా పెంచుతుంది. అలాగే, స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇచ్చేందుకు దిగుమతి సుంకాలను సమీక్షించి, తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలి.

**ప్రపంచం మారుతోంది... భారత్ సిద్ధంగా ఉందా?**

అమెరికా టారిఫ్ యుద్ధం కారణంగా జర్మనీ, ఫ్రాన్స్, కెనడా వంటి దేశాలు తమ ఆర్థిక వ్యూహాలను మార్చుకుంటున్నాయి. అవి కొత్త వృద్ధి ఇంజిన్‌లుగా ఎదుగుతున్నాయి. ఈ సమయంలో భారత్ కూడా ఈ సంక్షోభాన్ని ఒక అవకాశంగా మలుచుకుంటే, దేశ భవిష్యత్తు కోసం అది చాలా కీలకమవుతుంది. ఆనంద్ మహీంద్రా చెప్పినట్టు, ప్రతి సంక్షోభంలోనూ ఒక మార్గం ఉంటుంది. అమెరికా విధించిన టారిఫ్‌లు భారత పరిశ్రమలపై ఒత్తిడిని కలిగించినప్పటికీ, అదే ఒత్తిడిని ఒక ప్రేరణగా మార్చుకుంటే, భారత్ ప్రపంచానికి ఒక తిరుగులేని పెట్టుబడి గమ్యంగా మారవచ్చు.

"సంక్షోభాన్ని మించిన అవకాశమే మన బలం" అనే ఆనంద్ మహీంద్రా మాటలు ఈ సమయంలో భారతదేశానికి ఒక గొప్ప సందేశాన్ని ఇస్తున్నాయి. ఈ సవాలును స్వీకరించి, దేశాన్ని మరింత శక్తివంతంగా మార్చుకునే అవకాశం మన చేతుల్లోనే ఉంది.

## TGSRTC ఉద్యోగాలకు అప్లై చేసేవారు ఇది తెలుసుకోండి: లేదంటే నిలువునా మోసపోతారు..!




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు దళారులు మోసాలకు పాల్పడుతున్నారు. అమాయకులకు ఉద్యోగం ఆశ చూపి డబ్బులు దండుకుంటున్నారు. దళారుల చేతిలో మోసపోయిన కొందరు బాధితులు విషయాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో టీజీఎస్?ఆర్టీసీ అప్రమత్తమైంది. ఈ మేరకు అభ్యర్థులకు కీలక సూచనలు చేసింది. టీజీఎస్?ఆర్టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ కొందరు మోసాలకు పాల్పడుతున్నట్లు తమకు దృష్టికి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి మేరకు సంస్థలో 3038 పోస్టుల భర్తీకి కసరత్తు ప్రారంభమైంది. ఈ పోస్టులకు ప్రభుత్వ నియామక బోర్డుల ద్వారా నోటిఫికేషన్ త్వరలోనే వెలువడనుంది. నియామక ప్రక్రియ పూర్తిగా మెరిట్ ఆధారంగా పారదర్శకంగా జరుగుతుంది. అడ్డదారుల్లో ఎవరికి కూడా ఉద్యోగాలు రావు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రలోభాలకు గురిచేసి డబ్బులు వసూలు చేసే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు. ఆర్టీసీలో ఉద్యోగాల పేరుతో ఎవరైనా మిమ్మల్ని సంప్రదిస్తే వెంటనే యాజమాన్యం దృష్టికి తీసుకువచ్చి స్థానిక పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేయాలని ఆర్టీసీ యాజమాన్యం అభ్యర్థులకు సూచించింది.

## రాఖీ వేళ తెలంగాణలో విషాదం.. చనిపోయిన తమ్ముడికి రాఖీ కట్టిన అక్క.. కన్నీళ్లు తెప్పిస్తోన్న ఘటన

**హైదరాబాద్ పెన్ పవర్:**అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్ల బంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగ వేళ ప్రతి ఒక్కరికీ కన్నీళ్లు తెప్పించే ఘటన ఒకటి చోటు చేసుకుంది. సోదరుడి మృతదేహానికే ఓ సోదరి రాఖీ కట్టింది. రాఖీ పండుగకు రెండు రోజుల ముందు అనారోగ్యంతో సోదరుడు చనిపోయాడు. తమ్ముడికి రాఖీ కట్టాలనే సంతోషంలో ఉన్న సోదరికి ఈ పిడుగు లాంటి వార్త తెలియడంతో ఆమె గుండె ముక్కలైంది. తమ్ముడు ఇక లేడనే చేదు నిజాన్ని ఆమె జీర్ణించుకుకోలేకపోయింది. విగత జీవిగా పాడై పై పడుకుని ఉన్న తమ్ముడికి రాఖీ కట్టింది. ఈ హృదయవిదారక దృశ్యం అక్కడున్న వారందరి చేత కన్నీళ్లు పెట్టించింది. ఈ ఘటన తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన పందిరి అప్పిరెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం (ఆగస్ట్ 6) మృతి చెందాడు. రాఖీ పండుగ రెండు రోజులే ఉండటంతో అప్పిరెడ్డి సోదరి జ్యోతి తమ్ముడికి రాఖీ కట్టేందుకు రావడానికి సిద్ధం అవుతోంది. ఈ సమయంలో ఒక్కసారిగా తమ్ముడు చనిపోయాడనే పిడుగు లాంటి వార్త ఆమెకు తెలిసింది. తమ్ముడి మరణవార్త విని బోరుబోరున విలపిస్తూ సోదరుడి ఇంటికి చేరుకుంది. వస్తూ వస్తూ తమ్ముడి కడదామని ముందే కొన్న రాఖీ కూడా తీసుకువచ్చింది. దు:ఖాన్ని దిగమింగుకుని పాడై పై విగత జీవిగా పడి ఉన్న తమ్ముడి మృతదేహానికి రాఖీ కట్టింది. ఈ సమయంలో.. రాఖీ కడతా లే తమ్ముడు.. ఇదే నీకు చివరి రాఖీ అంటూ జ్యోతి కన్నీరుమున్నీరుగా విలపించింది. జ్యోతి రోదించిన తీరు చూసి ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు గ్రామస్తులు ప్రతి ఒక్కరూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆమెను రోదనను ఆపడం ఎవరి తరం కాలేదు. దీంతో అక్కడ ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్గా మారగా.. అక్కాతమ్ముళ్ల బంధం చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు నెటిజన్లు.

# అమెరికాకు పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్.. రెండు నెలల్లో రెండోసారి.. ఏంటీ కథ?

హైదరాబాద్ పెన్ పవర్:పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్ మరోసారి అమెరికా పర్యటనకు సిద్ధమయ్యారు. ఇది రెండు నెలల వ్యవధిలో ఆయన రెండవ యుఎస్ పర్యటన కావడం గమనార్హం. ఈసారి ఆయన యునైటెడ్ స్టేట్స్ సెంట్రల్ కమాండ్ కమాండర్ (%జుజుచీజుబీ%) చీఫ్ జనరల్ మైకేల్ కురిల్లా వీడ్కోలు కార్యక్రమానికి హాజరుకానున్నారు.
అమెరికా మధ్యప్రాచ్యంలో సైనిక చర్యలను పర్యవేక్షించిన కురిల్లా, పాక్‌ను "అద్భుత భాగస్వామి"గా ప్రశంసించారు. ఇటీవల ఐసిస్–ఖోరాసాన్ ఉగ్రవాదులను పాక్ పట్టుకున్నందుకు అమెరికా ఇచ్చిన ఇంటెలిజెన్స్‌పై ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ నేపథ్యంలో ఆయన పాకిస్తాన్ పర్యటన సందర్భంగా "నిషాన్–ఎ–ఇమ్తియాజ్" అవార్డుతో సత్కరించారు.

**భారత్ అసహనం**

జనరల్ కురిల్లా వ్యాఖ్యలు అమెరికా %–% పాక్ మధ్య పెరుగుతున్న సైనిక సంబంధాలు భారత్‌లో అసంతృప్తిని కలిగించాయి. ఉగ్రవాదానికి భారత్ ఎదురుగా పోరాటం చేస్తుంటే, పాక్‌ను ప్రశంసిస్తూ అమెరికా ఓవర్‌టోన్ ఇవ్వడం పట్ల భారత్ వ్యతిరేకంగా స్పందించింది.




**ట్రంప్ – ఆసిమ్ మునీర్ భేటీ.. విశ్వ రాజకీయాలలో కొత్త మలుపు?**

జూన్‌లో ఆసిమ్ మునీర్ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఇది ఒక మైలురాయి సమావేశంగా గుర్తించబడింది, ఎందుకంటే ఒక అమెరికా అధ్యక్షుడు అది కూడా ఎలాంటి ప్రభుత్వ అధికారుల మద్దతు లేకుండా ఒక పాక్ ఆర్మీ చీఫ్‌ను ప్రత్యక్షంగా లంచ్‌కు ఆహ్వానించడం ఇదే తొలిసారి.

ఈ భేటీ భారత్ – పాక్ మధ్య మే నెలలో పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో చోటు చేసుకుంది. పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత ట్రంప్ పబ్లిక్‌గా ఆసిమ్ మునీర్‌ను ప్రశంసించారు. "ఆయన యుద్ధానికి పోకుండా సంయమనం పాటించడం వల్లే నేను ఆయనను కలిసాను" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**ట్రంప్‌కు నోబెల్ నామినేషన్ – పాకిస్తాన్ ఔదార్యం**

ఈ భేటీ తర్వాత ఆసిమ్ మునీర్ ట్రంప్‌ను "యుద్ధ నివారణ సాయానికి" నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేయాలని పాకిస్తాన్ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. వెంటనే పాక్ ప్రభుత్వం అధికారికంగా ట్రంప్‌ను నామినేట్ చేసింది. ట్రంప్‌ను మెప్పించేందుకు పాక్ చేస్తున్న రాజకీయ వ్యూహాలు ఆసక్తికరంగా మారాయి. ఇవన్నీ చూస్తుంటే పాక్–అమెరికా మధ్య సైనిక సంబంధాలు తిరిగి పెరుగుతున్నాయన్న విషయం స్పష్టంగా కనిపిస్తుంది. పాక్ తన పాత వ్యూహాలను కొనసాగిస్తూ అమెరికా మద్దతును పొందేందుకు కృషి చేస్తోంది. కానీ ఇదంతా భారత్ %–%అమెరికా సంబంధాలపై ఎటువంటి ప్రభావం చూపుతుందో చూడాల్సిందే.

# ఇండియాకి తిరిగి వెళ్లిపో.....ఐర్లాండ్ లో ఆరేళ్ల భారత చిన్నారిపై దాడి!




హైదరాబాద్ పెన్ పవర్:ఈ మధ్యకాలంలో చిన్నారులపై లైంగిక దాడులు అందరిలో భయాందోళనకు గురి చేస్తుంటే.. ఇప్పుడు ఒక చిన్నారిపై జరిగిన దాడి మాత్రం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కనీ విని ఎరుగని రీతిలో నేటితరం బాలలు చేసిన పని సిగ్గుచేటు అంటూ పలువురు నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. ఐర్లాండ్ లోని భారత పౌరులపై ఇప్పుడు భౌతిక దాడులు పెరిగిపోతున్నాయి. తాజాగా ఆరు సంవత్సరాల చిన్నారిపై జాత్యాహంకార దాడి జరిగింది. చిన్నారి ముఖంతో పాటు ఆమె వ్యక్తిగత అవయవాలపై కూడా కొంతమంది దుండగులు కొట్టడం అమానవీయమని చెప్పవచ్చు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తోంది.
పూర్తి వివరాల్లోకి వెళితే.. భారత సంతతికి చెందిన బాధిత బాలిక కుటుంబం గత ఎనిమిది సంవత్సరాలుగా ఐర్లాండ్ లోనే నివసిస్తున్నారు. వీరికి ఐరిష్ పౌరసత్వం కూడా లభించింది. అక్కడే చిన్నారి తల్లి నర్సుగా పనిచేస్తోంది. తాము నివసిస్తున్న వీధిలో తన కూతురిపై జరిగిన ఆ అమానవీయ ఘటనను ఆమె మీడియాతో పంచుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. "ఈనెల 4వ తేదీన నా కూతురు కొంతమందితో కలిసి ఇంటి బయట ఆడుకుంటుండగా.. 12- 14 సంవత్సరాల మధ్య వయసున్న కొంతమంది అబ్బాయిలు నా కూతురిపై దాడి చేశారు." ఇండియాకి తిరిగి వెళ్లిపో" అంటూ జాత్యహంకార దూషణలు చేశారు. అక్కడితో ఆగకుండా ఆమె ముఖంపై కొట్టడం, ఆమె వ్యక్తిగత అవయవాలపై కూడా దాడి చేశారు.వెంటనే ఇంట్లోకి పరిగెత్తుకుంటూ వచ్చి ఏడుస్తూనే ఉండిపోయింది. ఈ ఘటనతో నా కూతురు చాలా భయపడి పోయింది. నేను 10 నెలల నా కుమారుడికి ఇంట్లో ఆహారం తినిపిస్తూ ఉండగా ఇదంతా జరిగింది. దీనిని చూస్తుంటే ఇక్కడ మాకు సురక్షితంగా అనిపించడం లేదు".. అంటూ ఆమె తెలిపారు. అంతేకాదు బయట జరుగుతుంటే.. ఈ ఘటన తనకు తెలియలేదని ఈ ఘటన తమను తీవ్రంగా కలిచివేసింది అని ఆమె బాధపడ్డారు. అంతేకాదు తన కూతురిపై జరిగిన ఈ దాడిని ఆపలేకపోయానని తీవ్ర మనస్తాపం వ్యక్తం చేశారు. ప్రస్తుతం దీనిపై ఫిర్యాదు చేశానని అయితే వారికి శిక్ష విధించడం కంటే ముందు కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరినట్లు కూడా ఆమె తెలిపారు. అయితే ఇది విన్న నెటిజన్లు మాత్రం నెటిజన్స్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ జనరేషన్లో కూడా జాతి, కులం, మతం, వర్ణం గురించి ఆలోచించడం ఏంటి? అసలు ఈ పిల్లలు ఏ జనరేషన్లో ఉన్నారు..? మీరు ఇలా ప్రవర్తించడం వెనక అసలు కారణం ఏమిటి? అంటూ కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ కామెంట్లు చేస్తున్నారు.
ఇకపోతే పిల్లల్లో ఇలాంటి ఆలోచనలు రావడానికి గల కారణం ఇటీవల ఐర్లాండ్లో భారతీయులపై జాత్యహంకార దాడులు జరగడమే ప్రధాన కారణం అని తెలుస్తోంది. జూలై 19న డబ్లిన్ శివారులోని తల్లాగ్ట్ లో డాక్టర్ సంతోష్ యాదవ్ అనే భారత పౌరుడిపై కొంతమంది స్థానిక యువకులు ఇలా జాతిని ఉద్దేశించి దాడికి దిగారు. ఈ ఘటనలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు.. ఈ ఘటన మరువక ముందే ఇప్పుడు చిన్నారిపై కూడా ఇలా జాతి పేరిట దాడులు చేయడం నిజంగా బాధాకరమని చెప్పాలి. ప్రస్తుతం ప్రతికూల సమయాలలో నిర్జన ప్రదేశాలకు వెళ్లొద్దని, భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకోవాలి అని ఐర్లాండ్ లోని భారత రాయబార కార్యాలయం భారత పౌరులకు సూచించింది.